
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శనివారం 8 మార్చి 2025



ఆ అధికారే.. కాంట్రాక్టర్?



కుమ్మిచెట్టు నుంచి మామిడిగుడ్డి రోడ్డు పనులు ఇలా..

- బినామీ పేర్లతో పనులు దక్కించుకుని..
- నాణ్యత లేకుండా రహదారుల నిర్మాణం
- ఇంటి వద్దే ఎం బుక్‌లో నమోదు
- రూ.కోట్లలో బిల్లులు డ్రా చేస్తున్న వైనం
- ఐటీడీఏ ఇంజనీరింగ్ ఉద్యోగి బాగోతమిదీ

మెళియాపుట్టి, మార్చి 7(ఆంధ్రజ్యోతి)

రహదారులు లేని గిరిజన గ్రామాలు ఉండకూడదనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం రోడ్ల నిర్మాణానికి రూ.కోట్లలో ఉపాధిహామీ నిధులను మంజూరు చేసింది. ఈ నిధులు సీతంపేట ఐటీడీఏ ఇంజనీరింగ్‌శాఖలో పనిచేస్తున్న ఓ అధికారికి కల్పతరువుగా మారాయి. వైసీపీ హయాంలో కొంతమంది బినామీల పేరుతో ఆ అధికారి పనులు చేయించినట్టు విమర్శలు ఉన్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అదే విధానాన్ని కొనసాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొంతమంది నాయకులతో పరిచయాలు ఏర్పరచుకుని.. బినామీ పేర్లతో పనులు దక్కించుకున్నారు. ఆ అధికారే.. కాంట్రాక్టర్ అవతారమెత్తి బినామీలతో పనులు చేయిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఎం-బుక్‌లో నమోదు చేయాల్సిన అధికారే పనులు చేయిస్తే.. వాటి నాణ్యత ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాలని పేర్కొంటున్నారు. వైసీపీ హయాంలో కొండలపై ఉన్న గ్రామాలకు రహదారుల పేరిట రూ.కోట్లు నిధులు ఖర్చు చేసినట్టు చూపి.. బిల్లులు చేసుకున్నారు. ఆ పనులు పూర్తికాకపోవడంతో ప్రస్తుత కూటమి ప్రభుత్వం మళ్లీ వాటి కోసం నిధులు కేటాయించింది. ఆ అధికారి తీరుతో ఈ పనుల్లోనూ నాణ్యత ప్రశ్నార్థకమేనని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



నాలుగు కిలోమీటర్లకు నాలుగు విభాగాలుగా విభజించిన కుడ్డబ రోడ్డు

ఒకే పని మూడు విభాగాలుగా..

ఒకే రోడ్డును మూడు విభాగాలుగా విభజించి పనులు చేస్తారు. రూ.40 (మిగతా 6వ పేజీలో..)

బినామీ పేర్లతో రోడ్ల పనులిలా..

కుమ్మిచెట్టు జంక్షన్ నుంచి వయా మామిడిగుడ్డి టెక్కలి- మెళియాపుట్టి రోడ్డు జంక్షన్‌కు మూడు విభాగాలుగా విభజించారు. ఒక కిలోమీటరుకు రూ.40 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేశారు. అలాగే పర్లాఖిమిడి - పూండి రోడ్డు జంక్షన్ నుంచి బురదరామచంద్రపురానికి రోడ్డు పనులు చేస్తున్నారు. ఒకే మార్గంలో ఉన్న అచ్చనాపురం- చింతలపోలూరు రోడ్డు, కుడ్డబ నుంచి కాపుసర్జనాపురం వరకు, ఎం.ఎస్.రోడ్డు నుంచి అచ్చాపురం వయా నందలపాడు వరకు, అచ్చనాపురం నుంచి రాజపురం వరకూ రోడ్డు పనులు చేస్తున్నారు. ఒకే రోడ్డు నాలుగు కిలోమీటర్లకు నాలుగు భాగాలుగా విభజించి పనులు చేస్తుండడంపై అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. అలాగే మారడికోట నుంచి ఎర్రమన్నాగూడ గ్రామానికి రూ.112.50 లక్షలతో పనులు చేయిస్తున్నట్టు తెలుస్తోంది. యాంపిల్ గ్రేస్ క్రియేషన్స్ పేరిట వెండర్ ద్వారా ఈ పనులు చేయిస్తున్నారు. ఈ వెండర్ ఆ అధికారికి దగ్గర బంధువని తెలుస్తోంది. చేసిన పనులకు సంబంధించిన బిల్లులు పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఎస్‌బీఐ ఖాతా (అకౌంట్ నెంబర్ 43603371314, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఎస్‌బీఐ ఎన్000818)లో పడుతుండడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని పనులను రాజు అనే వెండర్ ద్వారా ఆ అధికారే చేయిస్తున్నట్టు తెలుస్తోంది.

ఈ నెలా.. కందిపప్పు లేనట్టే

- బియ్యం, పంచదారతో రేషన్ సరి



శ్రీకాకుళం అర్బన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులకు ఈ నెల కూడా కందిపప్పు కరువైంది. ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ప్రతి నెలా రేషన్‌కార్డుదారులకు బియ్యం, కందిపప్పు, పంచదార, గోధుమ పిండి తదితర నిత్యావసర సరుకులను అందజేస్తోంది. కాగా కొన్ని నెలల నుంచి కేవలం బియ్యం, పంచదార మాత్రమే సరఫరా చేస్తోంది. కందిపప్పు ఒక్కో నెల కొంతమందికి కార్డుదారులకు మాత్రమే ఇస్తోంది. శ్రీకాకుళం అర్బన్, రూరల్ పరిధిలో ఉన్న మొత్తం 90 డిపోల్లోనూ 38 ఎండీయూ వాహనాల ద్వారా రేషన్‌సరుకులు పంపిణీ చేస్తున్నారు. కాగా ఈ నెల ఏ డిపో పరిధిలో కూడా కందిపప్పు పంపిణీ చేయలేదని కార్డుదారులు ఆవేదన చెందుతున్నారు. కొంతకాలంగా గోధుమపిండి సరఫరా కూడా నిలిపేశారని, ప్రస్తుతం బియ్యం, పంచదార మాత్ర మే ఇస్తున్నారని పేర్కొంటున్నారు. ఐదు నెలల నుంచి కందిపప్పు కూడా సరఫరా చేయడం లేదని వాపోతున్నారు. మార్కెట్‌లో కందిపప్పు ధర ఎక్కువగా ఉందని, ప్రభుత్వం సబ్సిడీపై తమకు రేషన్ సరుకుల ద్వారా పంపిణీ చేస్తే కొంత ఊరట లభిస్తుందని అభిప్రాయపడుతున్నారు. ప్రతి నెలా నిత్యావసర సరకులు సక్రమంగా అందజేయాలని కోరుతున్నారు.

- ఈ విషయమై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి టి.వేణుగోపాల్ వద్ద ప్రస్తావించగా.. 'జిల్లాలో ఫిబ్రవరి నెల వరకు ఉన్న కందిపప్పును పంపిణీ చేశాం. ప్రతి నెలా జిల్లావ్యాప్తంగా సుమారు 650 టన్నుల కందిపప్పు పంపిణీ చేస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా టెండర్లు ఖరారు అవుతుండడంతో ఈ నెలలో కందిపప్పు పంపిణీ జరగలేదు. టెండర్ల ప్రక్రియ పూర్తయితే.. ఏప్రిల్ నుంచి జిల్లా వ్యాప్తంగా కందిపప్పు సరఫరా చేస్తామ'ని తెలిపారు.



శ్రీకాకుళంలో రేషన్ బియ్యం పంపిణీ



ఉత్సాహంగా.. కబడ్డీ పోటీలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, మార్చి7(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం శ్రీకాకుళంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో విద్యార్థినులకు నిర్వహించిన కబడ్డీ పోటీలు ఉత్సాహంగా సాగాయి. విశ్రాంత అధ్యాపకురాలు, రచయిత్రి పత్తి సుమతి ముఖ్యఅతిథిగా హాజరై ఈ పోటీలను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. విద్యార్థినుల్లో పోటీతత్వం పెంచేందుకు ఇటువంటి క్రీడలు దోహదపడతాయని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో ఆత్మస్థైర్యంతో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు, పీడీ మోహన్‌రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం



- వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలు

మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళామణులు అన్ని రంగాల్లోనూ సత్తా చాటుతున్నారు. ఓవైపు కుటుంబ బాధ్యతల్లోనూ, మరోవైపు విధుల నిర్వహణలోనూ.. ఇంకోవైపు శ్రమైక జీవన పోరాటంలోనూ కీలకపాత్ర పోషిస్తున్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లాలో వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళల గురించి ప్రత్యేక కథనం -6లో

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా న్యాయాధికారి జేఏ మౌలానా



గుజరాతీపేట, మార్చి 7(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'జిల్లాలోని 18 బెంచీల్లో శనివారం ఉదయం 10 గంటల నుంచి లోక్‌అదాలత్ నిర్వహించనున్నాం. రాజీ పడదగిన క్రిమినల్, సివిల్ కేసులు వీటి ద్వారా పరిష్కరించుకోవాలి. మెటార్, యాక్సిడెంట్, ఎక్సైజ్ తదితర కేసులు కూడా రాజీ చేసుకునేందుకు ప్రయత్నించాల'ని జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా సూచించారు.

ఉపాధి కోసం వెళ్లి..



భుజంగరావు (ఫైల్)

- ఇరాక్‌లో జిల్లావాసి మృతి

కవిటి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం ఇరాక్‌కు వలస వెళ్లిన జిల్లావాసి.. అక్కడ పనిచేసే చోట జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. కుటుంబ సభ్యులకు తీరని విషాదాన్ని మిగిల్చాడు. మృతుడి కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. కవిటి మండలం ఆర్.బెలగాం గ్రామానికి చెందిన తిప్పన భుజంగరావు(43) ఇరాక్‌లో ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. భుజంగరావు ఉపాధి నిమిత్తం నాలుగేళ్ల కిందట ఇరాక్ వెళ్లాడు. అక్కడ బోసరా ప్రాంతంలోని కెప్పి కంపెనీలో పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి విధులు నిర్వహిస్తున్న సమయంలో అమ్మోనియా ట్యాంకరు వద్ద జరిగిన ప్రమాదంలో చిక్కుకున్నాడు. తోటి కార్మికులు కాపాడే ప్రయత్నం చేసినా ప్రయోజనం లేకపోయింది. ఈ ప్రమాదంలో భుజంగరావు మృతి చెందినట్టు.. శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులకు సమాచారం వచ్చింది. దీంతో భార్య జయలక్ష్మితోపాటు తల్లి దమయంతి బోరున విలపించారు. భుజంగరావుకు దీక్ష, రిషి అనే ఇద్దరు చిన్నారులు కూడా ఉన్నారు. ఇంటి పెద్ద మృతి చెందడంతో ఇక తమకు దిక్కెవరంటూ భార్య జయలక్ష్మి రోదిస్తున్నారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు విషాదంలో మునిగిపోయారు.



తిరుపతిరావు (ఫైల్)

సైనిక లాంఛనాలతో **ఆర్మీ జవాన్ అంత్యక్రియలు** 8లో

భక్తి శ్రద్ధలతో ఎల్లమ్మకు పూజలు

జాతరకు ముందే

పోటెత్తిన భక్తులు

- నేడు జంట పట్టణాల్లో ట్రాఫిక్ ఆంక్షలు
- 137 మంది పోలీసులతో బందోబస్తు

6లో

కుదిరిన వేతన ఒప్పందం

- 25 రోజుల సమ్మెకు తెర

8లో

జగన్నాథా.. చూసితివా!



- మాన్యం ఉన్నా ఆదాయం రాదాయె
- కౌలు పేరిట డబ్బులు పక్కదారి
- రూ.లక్షలు స్వాహా చేస్తున్న వైనం
- ధూపదీప నైవేద్యాలు కరువు
- నిర్వహణలేక శిథిలావస్థలో ఆలయం

మందస మండలం సాబకోట గ్రామంలోని జగన్నాథస్వామి ఆలయమిది. రూ.లక్షల్లో ఆదాయం వస్తున్నా.. నిధులు స్వాహా అవడంతో ఈ ఆలయం ఆలనాపాలనకు నోచుకోవడం లేదు. గ్రామస్థులే చందాలు వేసుకొని ఆలయానికి సున్నం వేయించుకున్న దుస్థితి నెలకొంది.

హరిపురం, మార్చి 7(ఆంధ్రజ్యోతి):

మందస సంస్థాన రాజుల ఆధ్వర్యంలో సుమారు రెండు వందల ఏళ్ల కిందట మందస మండలం సాబకోటలో నిర్మించిన జగన్నాథస్వామి ఆలయం ప్రాభవం కోల్పోతోంది. ఒకప్పుడు సుమారు 25 ఎకరాల మాన్యంతో ఎంతో ప్రాచుర్యం పొందిన ఈ ఆలయం.. నేడు ధూపదీపాలకు కూడా నోచుకోవడం లేదు. ప్రభుత్వం నుంచి వస్తున్న రూ.లక్షల నిధులు వైసీపీ నాయకుల అండదండలతో కొంతమంది దర్జాగా స్వాహా చేస్తున్నారు. ఆలయ నిర్వహణ కోసం రాజుల కాలంలోనే 22 ఎకరాల భూమి దేవస్థానం పేరుతో.. 3 ఎకరాలు ఆలయ పూజారి పేరుతో అప్పగించారు. కాలక్రమంలో పూజారి పేరుతో ఇచ్చిన భూమి పరుల ఆధీనంలోకి వెళ్లిపోయింది. దేవుడి పేరు మీద ఉన్న 22ఎకరాల భూమిలో తితలీ తుఫాన్ సమయంలో ఇసుక మేటతో మూడు ఎకరాలు బీడుగా మారింది. మరో 19 ఎకరాలు గ్రామస్థులకు కౌలుకు అప్పగించారు. ఆదాయం వస్తున్నా.. పాలకులు, అధికారుల చేతివాటంతో నిధులు దేవుడికి చేరడంలేదు. దీంతో కనీస స్థాయిలో ఆలయ నిర్వహణ కరువవుతోందని భక్తులు, గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాబకోటలో జగన్నాథస్వామి ఆలయ భూమిని వైసీపీ నాయకుడి అండతో ఆక్రమించి చికెన్ దుకాణం నిర్వహిస్తున్న దృశ్యమిది. దీనిపై గ్రామస్థులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా కనీసం స్పందన లేదు. ఆలయ భూముల్లో పక్కా నిర్మాణాలు.. ఆపై మాంసం దుకాణాలా? అని పలువురు భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



రూ.లక్షల్లో స్వాహా...

జగన్నాథస్వామి ఆలయానికి ఓ వైపు ప్రభుత్వ నిధులు.. మరోవైపు భూములు కౌలు సాగు ద్వారా ఎకరాకు రూ.6వేలు చొప్పున 19 ఎకరాలకుగానూ ఏటా రూ.1.14లక్షలు ఆదాయం సమకూరుతోంది. దీంతోపాటు భక్తులు, స్థానికుల విరాళాలు, హుండీ ఆదాయం రూ.లక్షల్లో వస్తోంది. వీటన్నింటినీ స్థానిక వైసీపీ నాయకుల అండతో ఇక్కడ ఆలయ ఇన్‌చార్జి అధికారి ఒకరు స్వాహా చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆ అధికారి తన అన్న కుమారుడి పేరిట చెక్కులు రాసి నిధులు డ్రా చేశారని ఆధారాలతో సహా జిల్లాస్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా స్పందన లేదని వాపోయారు. ఆర్టీఐ చట్టం ద్వారా నిధులు వివరాలు అడగ్గా.. ఆలయాలు దాని పరిధిలోకి రావంటూ జిల్లా అధికారులు సమాధాన మిచ్చారని పేర్కొంటున్నారు. గత ఐదేళ్లుగా స్వాహా కొనసాగుతోందని వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విలువైన భూముల ఆక్రమణ..

జగన్నాథస్వామి ఆలయానికి రోడ్డుపక్కనే (మిగతా 6వ పేజీలో..)

శిథిలావస్థలో ఆలయం



పురాతన ఆలయం కావడంతో శిథిలావస్థకు చేరుకుంది. ప్రహరీ, ప్రసాదాల గది పూర్తిగా ధ్వంసమయ్యాయి. కొద్దిపాటి మరమ్మతులు చేపడితే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ఆలయ భూముల నుంచి వచ్చిన ఆదాయం వాటిపై ఖర్చుచేస్తే చాలు ఆలయానికి పూర్వవైభవం వస్తుంది.

- నాగ మహేష్, ఆలయ కమిటీ సభ్యుడు, సాబకోట

ధూపదీపాలు కరువు



ఆలయ నిర్వహణ, నైవేద్యం కోసం గ్రామంలో ఇంటింటా బియ్యం అడిగి పెట్టాల్సి వస్తోంది. ఆలయాల పేరుతో భూములున్నా ఫలసాయం రావడంలేదు. దీంతో అర్చకుల జీవనమే భారమైంది. ఆలయ నిర్వహణ కష్టమవుతోంది.

- హరికృష్ణ పండా, ఆలయ అర్చకుడు

అధికారుల్లో స్పందన లేదు



ఆలయ నిర్వహణ, అర్చకుల పోషణ, భూముల ఆదాయంపై కనీసం అధికారుల్లో స్పందనలేదు. విలువైన భూములు ఆక్రమణల్లో ఉండగా.. వస్తున్న కౌలు ఆలయ అభివృద్ధికి ఖర్చు చేయడంలేదు. దీంతో ఆలయానికి రంగులు వేసే పరిస్థితి కనిపించడంలేదు. ఆలయ నిర్వహణ, ధూపదీపాల కోసం గ్రామస్థులే డబ్బులు వెచ్చిస్తున్నారు.

-కొండ దీనబంధు, గ్రామస్థుడు, సాబకోట


స్వాతి సోమనాథ్

అక్షరమై వెలుగుతూ.. కళా రంగంలో మెరుస్తూ

● వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలు
● నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ఆకాశంలో సగం వారు. అవకాశాలను అందిపుచ్చుకొని... రాణించడంలోనూ మేటి వారు. నేలపైనా... నింగిలోనూ మెరవడం వారికి మాత్రమే సాధ్యం. వారే మన జీవితాల్లో సగమై... మునుముందుకు నడిపిస్తున్న మహిళామణులు. శనివారం 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం' సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళల గురించి తెలుసుకుందాం.

అక్షర 'జ్యోతి' వెలిగిస్తూ...

● ఇటు బోధన... అటు సమాజ సేవ


ఎంఆర్ జ్యోతిఫెడరిక్

నరసన్నపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నిరక్షరాసులైన మహిళల్లో అక్షర కాంతులను నింపేందుకు సుమారు 40 ఏళ్ల పాటు అవిశ్రాంతగా సేవందించిన విద్యాజ్యోతి... రిటైర్డు ప్రిన్సిపాల్ మానుకొండ జ్యోతిఫెడరిక్. 1986లో ఎంకాం పూర్తి చేసిన తరువాత పార్ట్‌టైమ్ లెక్చరర్‌గా నరసన్నపేటలో వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. 1992లో ప్రభుత్వ లెక్చరర్‌గా బాధ్యతలను స్వీకరించిన తరువాత.. అప్పట్లో ప్రభుత్వం నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు చేపట్టిన 'అక్షర క్రాంతి' పథకంపై ప్రజలకు అవగాహన కల్పించడంలో కీలక పాత్ర పోషించారు. గ్రామీణ మహిళలకు అక్షరాల ఆవశ్యకతను తెలిపి... చదువు నేర్చుకునేలా చేయడంలో విజయం సాధించారు. అప్పటి కలెక్టర్ అనిల్ చంద్రపునేఠా నుంచి కూడా అవార్డులు అందుకున్నారు. మరో వైపు ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెక్చరర్‌గా మహిళలు ఉన్నత చదువులు చదివేలా ప్రోత్సహించేవారు. శైలజ, టెంక కల్యాణి, సునీత వంటి ఎందరో శిష్యులు పోలీసు శాఖలో పనిచేస్తున్నారు. ఇక ఉపాధ్యాయులుగా, ఇతర రంగాల్లో స్థిరపడిన వారు ఎందరో. అరు పదులు దాటినా ఇప్పటికీ మహిళలు, బాలల హక్కులపె తన గళం విప్పుతూ సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు జ్యోతి ఫెడరిక్.


తన లైబ్రరీలో పత్తి సుమతి

సమస్యలపై కలం ఎత్తే సుమతి!

శ్రీకాకుళం కల్చరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని అసమానతలను ఎత్తి చూపడానికి... వాస్తవాలను మన కళ్ల ముందు ఉంచడానికి కొందరు గళమెత్తితే.. కొందరు కలమెత్తుతుంటారు. ఈ రెండో కోవకు చెందిన వారే శ్రీకాకుళానికి చెందిన పత్తి సుమతి (73). బోటనీ లెక్చరర్‌గా పదవీ విరమణ చేశారు. దేశభక్తిని పెంపొందించడం... యువతను సన్మార్గంలో నడిపించడమే లక్ష్యంగా ఆమె రచనలు సాగుతాయి. బంధుత్వాల పేరుతో జరిగే మేనరికపు పెళ్లిళ్ల వల్ల జన్యు లోపంతో తలెత్తే నష్టాలను వివరిస్తూ సుమతి రచించిన 'మే నరకాలు' పుస్తకం ఏ తరాన్నైనా ఆలోచింపజేసేదే. చదువుల ఉరి, జన్యూ అవగాహన, శబ్ద సునామి, శాస్త్రీయ పరిజ్ఞానానికి శత్రువు స్వార్థం వంటి పుస్తకాలతో ఆమె పాఠకులలో గుర్తింపు తెచ్చుకున్నారు. కోటికొక్కరు, జెన్నీమార్క్స్, జన్యుతేజాలు, మన జీనోమ్ మారాలి వంటి రచనలతోనూ ఆకట్టుకున్నారు. నిర్భయ సంఘటనపై ఆమె రాసిన 'మరో మహా సంగ్రామం', ప్రధానిగా మోదీ విజయంపై రచించిన 'కాలం గెలుపు', తమిళనాడు మాజీ సీఎం జయలలితపై 'వజ్రపుష్పం' వంటి రచనలు వంటి రచనలే ఆమె కలం నుంచి జాలువారాయి. తెలుగు రచయితల వేదిక (తెరవే)లో సభ్యురాలుగా ఉంటూ కథానికలు, కవితలు ఎన్నో రాశారు. 'చీమా చీమా ఎందుకు కుట్టావు?' పుస్తకాన్ని డిప్యూటీ సి.ఎం పవన్ కల్యాణ్‌కు అందజేశారు. జాతీయ ఉత్తమ ఉగాది పురస్కారం అందుకున్నారు. ప్రధానమ మంత్రి కార్యాలయం నుంచి ప్రశంసా పత్రం అందుకున్నారు. 'అంబేడ్కర్ భావజాలం-వర్తమాన భారతం' పుస్తకంతో గుంటూరులో రూ.5000 నగదు బహుమతి అందుకున్నారు. 'జీన్ విజన్ లైబ్రరీ ఫర్ న్యూ ఇండియా' పేరుతో గ్రంథాలయాన్ని నడుపుతున్నారు.


పవన్ కల్యాణ్‌కు పుస్తకం ఇచ్చిన సందర్భంలో.. (ఫైల్)

నృత్యంలో 'స్వాతి' ముత్యం!

శ్రీకాకుళం కల్చరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): కూచిపూడి నృత్యంతో అంతర్జాతీయ స్థాయిలో శ్రీకాకుళం జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చారు స్వాతి సోమనాథ్. తన నాట్య కౌశలంతో దేశ విదేశాల్లో పేరు ప్రఖ్యాతులు సాధించారీ నర్తకీమణి. నృత్యంలో ఆమె ప్రతిభకు వరించిన అవార్డులు, బిరుదులు ఎన్నో. 1997లో ఢిల్లీ తెలుగు అకాడమీ అవార్డు అందుకున్నారు. 1993లో జైపూర్‌లో రాజస్థాన్ గవర్నర్‌గా ఉన్న మర్రి చెన్నారెడ్డి ఆమెకు నాట్య కౌశల బిరుదు ప్రదానం చేశారు. 1998లో భారత ప్రభుత్వ సాంస్కృతిక రాయబారిగా బోట్స్ వానా, న్యూజిలాండ్, టాంజానియా, మోజాంబియా, ఇటలీ తదితర దేశాల్లో నృత్య ప్రదర్శనలు చేశారు. సోలో నృత్య రూపకాలు కూడా చేశారు. 'కామసూత్ర' నృత్య రూపకంతో ప్రత్యేక గుర్తింపు పొందారు. మన జిల్లాలోని దూసికి చెందిన స్వాతి ప్రస్తుతం శ్రీకాకుళం రూరల్ మండలంలోని కళ్లేపల్లిలో 'సంప్రదాయం' పేరుతో కూచిపూడి గురుకులాన్ని నడుపుతున్నారు. 2024లో 2 నెలల పాటు ఇంగ్లాండు, స్కాట్‌లాండ్, ఐర్లాండ్‌లలో పర్యటించి 'ద్రౌపది' కూచిపూడి నృత్య బ్యాలెట్‌ను ప్రదర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అనేక సార్లు ప్రశంసలు పొందారు.


సీఎం చంద్రబాబు నుంచి ప్రశంసలు అందుకుంటూ..(ఫైల్)

ఆమె పయనం... స్ఫూర్తిదాయకం

అరసవల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఆమె తండ్రి ఓ ప్రైవేటు డ్రైవర్. తల్లి గృహిణి. నివాసం విశాఖపట్నం. ఉన్న కొద్దిపాటి వనరులతోనే అకుంఠిత దీక్షతో ఆమె తన లక్ష్యం వైపు పయనించి... విజయం సాధించారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-1 పరీక్షలో 36వ ర్యాంకు సాధించి తల్లిదండ్రుల కళ్లల్లో ఆనందాన్ని నింపారు. ఆమె జిల్లా పంచాయతీ అధికారి కుచ్చర్లపాటి భారతీ సౌజన్య. డిగ్రీ వరకు విశాఖపట్నంలోనే చదువుకుని.. అనంతరం విజయనగరం మహారాజా కళాశాలలో ఎంబీఏ పూర్తి చేశారు. తరువాత ఎక్సెంచర్, డెలాయిట్ వంటి బహుళజాతి కంపెనీల్లో హెచ్‌ఆర్‌లో సుమారు ఎనిమిదేళ్ల పాటు విధులు నిర్వర్తించారు. ఆ సమయంలోనే వివాహమై..ఓ పాపకు జన్మనిచ్చారు. కానీ ఒక ప్రభుత్వ అధికారిగా పనిచేయాలన్న సంకల్పం ఆమెలో బలంగా ఉండేది. దాంతో 2017లో ఆమె ప్రైవేటు ఉద్యోగానికి రాజీనామా చేశారు. రెండున్నరేళ్ల పాపను చూసుకుంటూ ... ఇంట్లో ఉంటూనే... ఆన్‌లైన్‌లో కోచింగ్ తీసుకుంటూ ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షలకు హాజరయ్యారు. రాష్ట్ర స్థాయిలో 36వ ర్యాంకు సాధించారు. ఒక జిల్లా అధికారిగా విధుల్లో చేరి తన కలను నెరవేర్చుకున్నారు.

● అవకాశాలను అందిపుచ్చుకోవాలి...



నేటి యువతకు ఎన్నో అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. చదువుకునే రోజుల్లోనే వారు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. క్రమశిక్షణ, పట్టుదలతో శ్రమించి తమ లక్ష్యాలను చేరుకోవాలి. అవకాశాలను అందిపుచ్చుకోవాలి. ఉన్నత శిఖరాలను అధిరోహించాలి.

-కె.భారతీ సౌజన్య,
జిల్లా పంచాయతీ అధికారి

నాట్యంలో రాణిస్తున్న వాగ్దేవి..

గార, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మంలో రైతు కుటుంబంలో జన్మించిన వాగ్దేవి... జాతీయ, అంతర్జాతీయ వేదికలపై తన నాట్య ప్రదర్శనతో సిక్కోలు ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్నారు. శ్రీకూర్మానికి చెందిన రంగరాజు నరసింహస్వామి, వాణి దంపతుల కుమార్తె వేంకట లక్ష్మీ వాగ్దేవి కూచిపూడి నాట్యంలో రాణిస్తూ అనేక పురస్కారాలు, సన్మానాలు అందుకున్నారు. ఏడో ఏటనే నగరానికి చెందిన నాట్యాచార్యులు కాయల శివకుమార్ వద్ద నృత్యంలో ఓనమాలు దిద్దారు. అనంతరం వందల సంఖ్యలో నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. ప్రస్తుతం విశాఖపట్నానికి చెందిన ప్రేమ సాయి శిష్యరికంలో తంజావూరు, చిదంబరం, ఢిల్లీ తదితర ప్రాంతాల్లో నృత్య ప్రదర్శనలు ఇస్తున్నారు. 2017లో మలేషియా, దుబాయ్, అబుదాబీల్లో కూడా దివంగత శివకుమార్ నృత్య దర్శకత్వంలో నాట్య ప్రదర్శనలలో పాల్గొన్నారు. ప్రస్తుతం వైద్య విద్య (డెంటల్) అభ్యసిస్తున్న వాగ్దేవి... భవిష్యత్‌లో మరిన్ని నాట్య ప్రదర్శనల ద్వారా సిక్కోలు ఖ్యాతిని ఇనుమడింపజేయడానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.


రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో (ఫైల్)


రాజమండ్రిలో కళా తరంగిణి పురస్కారం అందుకుంటూ..(ఫైల్)

సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి..



శ్రీకాకుళం క్రైం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళలు అడ్డంకులు అధిగమించి లక్ష్యాలను సాధించడానికి ధైర్యం చాలా అవసరమని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు పర్యావరణ ఇంజనీర్ బి.కరుణ తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడారు. మహిళలకు ధైర్యం అవసరమని... అదే ఏ పరిస్థితుల్లోనైనా తోడుగా ఉంటుందన్నారు. మహిళలు భయాన్ని విడిచిపెడితేనే ముందుకు నడవగలరని ఆమె అన్నారు. దీని వల్ల సమాజంలో మహిళల పట్ల ఉన్న వివక్ష తగ్గుతుందన్నారు. మహిళా రక్షణ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

- బి.కరుణ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు పర్యావరణ ఇంజనీర్

భక్తి శ్రద్ధలతో ఎల్లమ్మకు పూజలు

జాతరకు ముందే పోటెత్తిన భక్తులు

● నేడు జంట పట్టణాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ● 137 మంది పోలీసులతో బందోబస్తు

పలాస, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎల్లమ్మ వీధిలో శనివారం జరిగే జామి ఎల్లమ్మ జాతరకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉంది. దీంతో కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు ఆధ్వర్యంలో మొ త్తం 137 మంది పోలీసులను బందో బస్తుకు వినియోగిస్తున్నారు. జాతర జరగక ముందే ఊహించని విధంగా భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. శుక్రవారం పలాస ఆర్డీఓ వెంకటేష్ తన కుటుంబంతో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు ఏర్పాట్లపై సూచనలు చేశారు. బారికేడ్లు సక్రమంగా నిర్మించాలని, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ట్రాఫిక్ ఆంక్షలు ఇలా...

● కాశీబుగ్గ మూడు రోడ్ల జంక్షన్ నుంచి పలాస వైపు ఎటువంటి పెద్ద వాహనాలు, చిన్నవాహనాలు అనుమతించం. ● పలాస వైపు నుంచి కాశీబుగ్గ వచ్చే వాహనాలు కోసంగిపురం, బెండి రోడ్లు మీదుగా చేరుకోవాలి. ● జాతరకు వచ్చే వారు తమ వాహనాలు పలాస వైపు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలోను, కాశీబుగ్గ నుంచి వచ్చే వాహనాలు రైల్వే మైదానంలో పార్కింగ్ చేసుకోవాలి. ● ఆటో కార్మికులు భక్తులను కాశీబుగ్గ మూడు రోడ్ల జంక్షన్, పలాస జూనియర్ కళాశాల రోడ్డు వద్ద దించాల్సి ఉంటుంది.


కుటుంబంతో ఎల్లమ్మను దర్శించుకుంటున్న పలాస ఆర్డీవో వెంకటేష్


ఎల్లమ్మ తల్లి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు..

గార, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వమరవెల్లిలో ప్రసిద్ధి చెందిన ఎల్లమ్మ తల్లి జాతర శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవంలో పాల్గొనడానికి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు తరలి వచ్చారు. గురువారం రాత్రి గజవాహనంపై మేళతాళాలతో గ్రామంలో తిరువీధి నిర్వహించారు. శుక్రవారం ఉదయం భక్తులు ఎల్లమ్మ పుట్ట వద్దకు వెళ్లి పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో గ్రామం సందడిగా కనిపించింది. ఎస్.ఐ. ఆర్.జనార్దనరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.




ఎల్లమ్మ దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు


జాతరలో భక్తులు

ఘనంగా సిర్లిపోతన్న జాతర

సరుబుజ్జిలి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వీరభద్రాపురం గ్రామంలో శు క్రవారం శిర్లిపోతన్న జాతరను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది మహా శివరాత్రి అనంతరం 9వ రోజున ఈ జాతరను నిర్వహిస్తారు. ప్రత్యేక మందిరంలో ఉన్న రేణుక ఎల్లమ్మ, సిర్లిపోతన్న పుట్టపై భక్తులు పసుపు కుంకుమ, కోడిగుడ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

వైభవంగా లక్ష్మీ నరసింహుని ఆలయ ప్రారంభోత్సవం



సోంపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): తాళ్లభద్రలో లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రారంభోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి విశాఖ బాలత్రిపుర సుందరి సేవాసదన్ వ్యవస్థాపకులు అక్కాజోస్యుల రమేష్ శర్మ ఆధ్వర్యంలో పూజలు ప్రారంభమయ్యాయి. సాయంత్రం ఉత్సవమూర్తుల తిరువీధి, మహిళలు కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. గ్రామ పెద్దలు, యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

← ఉత్సవమూర్తుల తిరువీధి


కలశాలతో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

ఆ అధికారే.. కాంట్రాక్టర్?

(ఐదో పేజీ తరువాయి)

లక్షలు దాటితే ఈఎన్‌సీ అనుమతులు తీసుకోవాలి. దీంతో ఆ ఇంజనీరింగ్ అధికారి.. ఒకే రోడ్డును నాలుగు భాగాలుగా విభజించి.. ఖర్చు రూ.40లక్షలకు దాటకుండా అంచనాలు రూపొందించారు. ఈఈ అనుమతితో ఈ పనులు చేపడుతున్నారు. మెళియాపుట్టిలో సుమారు 9 రహదారులకు బినామీ పేర్లతో పనులు చేయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పనులకు అంచనాలు రూపొందించే ముందు కలెక్టర్ ద్వారా టెక్నికల్ క్లియరెన్స్ అవసరం. కానీ, ఈ నిబంధన పాటించకుండా కలెక్టర్‌నే తప్పుదోవ పట్టించి.. రూ.కోట్లలో బిల్లులు మంజూరు చేయించుకున్నట్టు తెలుస్తోంది.

పనుల్లో నాణ్యత లోపం?

రహదారి పనుల్లో నాణ్యత లోపిస్తోందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పనులకు వాడే మెటల్‌తోపాటు రాయి పిండి జిల్లాలో ఒకే ఒక క్వారీ నుంచి తీసుకురావడానికి అనుమతులు ఇచ్చారు. రాజాం మండలం రాపాక నుంచి తీసుకువస్తే.. దీనికి సంబంధించి రవాణా చార్జీల బిల్లులు ఇస్తారు. అలా కాకుండా టెక్కలి, కోటబొమ్మాళి తదితర ప్రాంతాల్లో క్వారీల నుంచి చిప్స్ తీసుకువస్తున్నారు. రవాణా చార్జీలు తగ్గించి ఎం-బుక్‌లో మాత్రం రాపాక నుంచి తీసుకువచ్చినట్లు నమోదు చేస్తున్నారు. ఎర్రకంకరతో బెర్మ్‌లకు కూడా ఇదే మాదిరి ఎం-బుక్‌లో నమోదు చేసి ఆ అధికారి బిల్లులు పొందుతున్నారనే గిరిజనులు ఆరోపిస్తున్నారు. పనులపై ఉన్నతాధికారుల పరిశీలన కూడా కరువవుతోందని పేర్కొంటున్నారు. దీంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారని విమర్శిస్తున్నారు. ఆ అధికారి కార్యాలయంలో కూడా అందుబాటులో ఉండరని ఆరోపిస్తున్నారు. పనులు చేస్తున్న వారంతా ఆయన ఇంటి వద్దే ఎం-బుక్‌లో నమోదు చేయించుకుంటున్నారని పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నాణ్యతో పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

సీతంపేట ఐటీడీఏ పరిధిలో రహదారులు లేని గిరిజన గ్రామాలకు నిధులు మంజూరు చేశాం. అయితే టెక్నికల్ అనుమతులు మా వద్ద నుంచి ఇవ్వలేదు. ఆ పనులకు ఈఈ పరిధిలో అనుమతులు ఇచ్చారు. అయితే ప్రతి రహదారి పనులు పరిశీలించి క్యూసి రిపోర్టును తీసుకుంటాం. ఎక్కడైనా అధికారుల తప్పిదాలు ఉంటే చర్యలు తీసుకుంటాం.

-శ్రీనివాసరావు, ఈఎన్‌సీ, అమరావతి

జగన్నాథా.. చూసితివా!

(ఐదో పేజీ తరువాయి)

ఉన్న విలువైన భూమి ఆక్రమణకు గురవుతోంది. స్థానిక వైసీపీ నాయకుడి అండతో కొంతమంది పొలంలో మట్టి వేసి దుకాణాలు నిర్మిస్తున్నారు. దీంతోపాటు ఆ దుకాణాల్లో చికెన్ సెంటర్లు, పక్కా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. అయినా దేవదాయ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని భక్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి నిధులు స్వాహా, భూముల ఆక్రమణకు అడ్డుకట్ట వేయాలని, ఆలయానికి పూర్వవైభవం తీసుకురావాలని కోరుతున్నారు. దీనిపై జిల్లా దేవదాయశాఖ సహాయ కమిషనర్ బీఆర్‌వీవీ ప్రసాద్ పట్నాయక్ వద్ద ప్రస్తావించగా.. ఈ విషయం తన దృష్టికి రాలేదన్నారు. పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకుంటానని తెలిపారు.

స్వామీ ఇదేంటి?

- ఆదిత్యాలయంలో సిబ్బంది నిర్లక్ష్యం
- కానరాని సమయపాలన
- ఉదయం 11.50 గంటలైనా ఖాళీగానే కుర్చీలు
- రోజు రోజుకూ దిగజారుతున్న పరిస్థితులు



అరసవల్లిలో సూర్యనారాయణస్వామి దేవస్థానం

అరసవల్లి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అది దేశంలోనే ప్రఖ్యాతి గాంచిన సూర్యభగవానుడి దేవాలయం. నిత్యమూ వేలాది మంది భక్తులు తమ ఆరోగ్యం కోసం స్వామివారిని దర్శించుకునేందు వస్తుంటారు. అనతి కాలంలోనే భక్తుల తాకిడితో ఏడాదికి రూ.8 కోట్ల పైబడిన ఆదాయంతో డీసీ స్థాయికి ఎదిగింది. త్వరలోనే కేంద్ర ప్రభుత్వ ప్రసాద పథకం ద్వారా ఆలయ అభివృద్ధి కోసం, దేశంలోనే ఒక సుందర పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దేందుకు రూ.100కోట్ల నిధులు తీసుకువచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర మంత్రులు తీవ్రంగా కృషి చేస్తున్నారు. జిల్లాకే తలమానికంగా ఆలయాన్ని అభివృద్ధి చేయాలనే దృఢ సంకల్పంతో పనిచేస్తున్నారు. కానీ ఆలయానికి సంబంధించి పరిస్థితులు రోజురోజుకు దిగజారి పోతున్నాయని భక్తులు వాపోతున్నారు. శుక్రవారం ఉదయం 11.50 గంటల సమయమైనా ఒక్క ఉద్యోగి కూడా లేకపోవడంతో కుర్చీలు ఖాళీగా కనిపించాయి. ఇదీ అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి ఆలయంలో సిబ్బంది పరిస్థితి. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి శుక్రవారం ఉదయం స్వామివారిని దర్శించుకున్నారు. ఆ సమయంలో ఆలయానికి సంబంధించి ఇద్దరు దినసరి వేతన సిబ్బంది తప్పా కార్యాలయ సిబ్బంది ఒక్కరూ లేరు. ఆలయానికి వచ్చే భక్తులు కార్యాలయానికి వచ్చే అధికారులను కలవాలంటే ఆఫీసు ఖాళీగా కనిపించడంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు. ఆలయ ఈవో క్యాంపులో ఉన్న సమయంలో కూడా సిబ్బంది ఒక్కరూ కూడా విధులకు హాజరు కాకపోవడం దారుణం. పూర్తి ఖాళీగా ఉన్న కుర్చీలతో కార్యాలయం వెలవెలబోతోంది.



ఉదయం 11.50 గంటలైనా ఖాళీగా ఉన్న ఆలయ కార్యాలయం

కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి..

గత కొన్ని నెలలుగా ఆలయంలో ఎవరు ఏయే విధులు నిర్వర్తిస్తున్నారో, నిర్వహించాలో పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. మాఘమాసం ఆదివారాల్లో భక్తులు పెద్ద ఎత్తున స్వామివారి దర్శనాలకు వచ్చారు. ఆలయానికి రూ.లక్షల్లో ఆదాయం కూడా లభిస్తుంది. కానీ భక్తులు ఎండలోనే ఇబ్బందులు పడుతూ స్వామివారిని దర్శించుకుని వెనుదిరగడం కనిపించింది కానీ, వారికి నీడ కల్పించేందుకు ఆలయ అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. గతంలో భక్తులకు తాగునీరు, మజ్జిగ, బిస్కెట్ ప్యాకెట్స్ పంపిణీ చేసేవారు. ఇప్పుడు కనీసం తాగునీరు కూడా అందించే పరిస్థితి లేదు. అరసవల్లికి చెందిన కొంతమంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రతీ ఆదివారం స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు తాగునీరు అందిస్తున్నారు. ఆలయానికి ప్రొటోకాల్ దర్శనానికి ఉన్నతాధికారులు, నాయకులు వస్తే పరిస్థితి ఏంటని, దినసరి వేతన సిబ్బంది ఎంతవరకు బాధ్యత తీసుకోగలరని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇంత నిర్లక్ష్యంగా విధులు నిర్వర్తించడం ఎన్నడూ చూడలేదని స్థానికులు వాపోతున్నారు. అలాగే దినసరి వేతన ఉద్యోగులకు విధులను ప్రణాళికా బద్ధంగా కేటాయిస్తే ఆలయం ఒక క్రమపద్ధతిలో నడుస్తుందని, కానీ కేవలం ఒకరిద్దరిపైనే మొత్తం పనిభారం పడడంతో వారు కూడా తీవ్ర ఒత్తిడిలో విధులు పూర్తిస్థాయిలో నిర్వహించలేకపోతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఆలయ అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి, పరిస్థితులను చక్కదిద్దాలని, స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

సచివాలయ ఉద్యోగుల నిర్లక్ష్యం



పంజావీధి సచివాలయంలో పూర్తిస్థాయి సిబ్బంది లేక ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు

ఇచ్ఛాపురం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలో మొత్తం 10 సచివాలయాలు ఉన్నాయి. ఒక్కో సచివాలయానికి 10 విభాగాలకు సంబంధించి కార్యదర్శులను నియమించింది. ఇలా చూసుకుంటే అన్ని సచివాలయాలు కలుపుకొని 100 మంది ఉండాలి కానీ సగం మందే ఉన్నారు. ప్రస్తుతం ఆ స్థానాల్లో కొంత మంది ఇన్‌చార్జీలు ఉంటున్నారు. వీరు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విధుల్లో ఉండాలి. ఏదైనా ప్రభుత్వ లేదా ఇతర అత్యవసర సమయాల్లో బయటకు వెళ్లాల్సి ఉంటే కచ్చితంగా బుక్‌లో కారణం రాసి వెళ్లాలి. అయితే కొందరు సచివాలయ ఉద్యోగులు దీనిని ఆసరాగా చేసుకొని ప్రభుత్వాన్ని, ప్రజలను మోసగిస్తున్నారు. కార్యాలయానికి రావడంతోనే ఏదో ప్రభుత్వ కార్యక్రమం అంటూ సాకు చెప్పి బయటకు వెళ్లిసొంత పనుల్లో నిమగ్నమవుతున్నారు. వివిధ సేవలపై వచ్చే అర్జీదారులకు చుక్కలు కనబడుతున్నాయి. ఈ క్రమంలోనే శుక్రవారం పంజావీధి సచివాలయంలో ఇద్దరు మాత్రమే సిబ్బంది ఉన్నారు. మిగతా వారు ఎక్కడకు వెళ్లారని అడిగేవారే లేకపోవడంతో ఇష్టాను సారంగా ప్రవర్తిస్తున్నారు. ఇదొక్కటే కాదు పట్టణ పరిధిలోని చాలా సచివాలయాల పరిస్థితి ఇలాగే ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పర్యవేక్షిస్తాం

సచివాలయాల్లో సిబ్బంది కొరత వల్ల కొంత సమస్య ఎదురవుతుంది. మున్సిపాల్టీ పరిధిలోని పది సచివాలయాల పరిధిలో 100 మంది సిబ్బంది ఉండాలి. కానీ 60మందితోనే నెట్టుకొస్తున్నాం. ప్రభుత్వ సర్వేలు కారణంగా సిబ్బంది చాలావరకు ఫీల్డ్‌లోనే ఉండాల్సి వస్తుంది. సర్వేలు పూర్తయిన తర్వాత పూర్తిస్థాయిలో కార్యాలయాల్లో ఉండేలా చర్యలు తీసుకుంటాం. ఎప్పటికప్పుడు సచివాలయాలు పర్యవేక్షిస్తాం. సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటాం.

- ఎన్.రమేష్, మున్సిపల్ కమిషనర్

ఒక విద్యార్థి డీబారు.. 386 మంది గైర్హాజరు

గుజరాతీపేట, మార్చి 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న ఇంటర్ పరీక్షల్లో ఒక విద్యార్థి డీబారు అయ్యారు. ద్వితీయ సంవత్సరం మ్యాథమెటిక్స్, బోటనీ, సివిక్స్ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 386 మంది గైర్హాజరయ్యారు. జనరల్‌లో 18,047 మందికి గాను 17,694 మంది హాజరు కాగా, 353 మంది హాజరు కాలేదు. ఒకేషనల్స్‌కు సంబంధించి 1,102 మందికి 1,069 మంది హాజరు కాగా 33 మంది గైర్హాజరయ్యారు. మొత్తం మీద 19,149 మందికి 18,763 మంది హాజరైనట్టు అధికారులు తెలిపారు.

దర్యాప్తు వేగవంతం చేయాలి

శ్రీకాకుళం క్రైం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అపరిష్కృతంగా ఉన్న అదృశ్యం కేసులపై ప్రత్యేక దృష్టి సారించి దర్యాప్తు వేగవంతం చేయాలని పోలీసు అధికారులకు ఎస్పీ కేవీ .మహేశ్వరరెడ్డి ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జూమ్ కాన్ఫరెన్స్‌లో అదృశ్యం, హిట్ అండ్ రన్ కేసుల దర్యాప్తు, పురోగతి తదితర అంశాలపై ఏఎస్పీతో కలిసి సమీక్షించారు. బాలికలు, మహిళలు, యువకులు అదృశ్యం కేసులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు.

మహాధర్నాకు తరలిరండి

గార, మార్చి 7(ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈ నెల 12న జరగనున్న మహా ధర్నాకు తరలిరావాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు దాసరి లక్ష్మణరావు, శిర్ల మంగమ్మ కోరారు. శుక్రవారం సతివాడలో ఉపాధి వేతనదారులను కలిసి ఈ మేరకు కరపత్రాలు పంపిణీ చేశారు. వ్యవసాయ కార్మికులు డిమాండ్ల సాధన కోసం చేపడుతున్న ఈ ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉచితంగా శిక్షణ

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వెనుకబడిన తరగతుల మహిళలకు ఉచితంగా టైలరింగ్‌పై శిక్షణను బీసీ కార్పొరేషన్ ద్వారా ఇస్తున్నట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. 18 - 50 మధ్య వయస్సు గల వెనుకబడిన తరగతులకు చెందిన వారు, అలాగే అగ్రవర్ణాలకు చెందిన పేద మహిళలకు ఈ శిక్షణ ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన వారు తమ పూర్తి వివరాలతో సంబంధిత గ్రామ/వార్డు సచివాలయం, మండల పరిషత్ అభివృద్ధి అధికారిని, మున్సిపల్ కమిషనర్‌ను సంప్రదించాలన్నారు. ధ్రువపత్రం అందిస్తామన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

అరసవల్లి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో వేడుకలను శుక్రవారం నిర్వహించారు. కళాశాలకు చెందిన ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ కె.సురేఖ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ వీసీ కేఆర్ రజని, శ్రీకాకుళం ఆర్డీవో కె.సాయి ప్రత్యూష ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. కోఆర్డినేటర్లు ఆర్.హరిత, వై.పోలినాయుడు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి యువతే భవిష్యత్తు శాస్త్రవేత్తలు



ప్రాజెక్టులు పరిశీలిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల, మార్చి 7(ఆంధ్రజ్యోతి): నేటి యువత భవిష్యత్తు శాస్త్రవేత్తలని, పరిశోధకులు, సాంకేతిక నాయకులని రాజీవ్ గాంధీ వర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎం.విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం శ్రీకాకుళంలో టెక్నీవర్స్ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ప్రముఖ శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, ఆధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. సదస్సులో ప్రాజెక్ట్ ఎక్స్పో, ఆర్ట్ గ్యాలరీ ప్రదర్శనలు వివిధ సాంకేతిక వేదికల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది. కార్యక్రమంలో ప్రొఫెసర్ కేవీజీడీ బాలాజీ, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ముని రామకృష్ణ, వివేక్‌విజయ్ తదితరులు పాల్గొన్నారు.


రాజీవ్ స్వగృహ లబ్ధిదారులకు న్యాయం చేయండి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస, మార్చి 7(ఆంధ్రజ్యోతి): 2007లో చేపట్టిన రాజీవ్ స్వగృహ పథకం లబ్ధిదారులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన శాసనసభలో మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాజీవ్ స్వగృహ పథకం ద్వారా పేదలకు గృహ నిర్మాణాలు చేపడతామని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం బ్యాంకుల నుంచి వేయి కోట్ల రూపాయలు రుణంతో పాటు లబ్ధిదారుల నుంచి సుమారు రూ.455 కోట్లు సేకరించిందన్నారు. రాష్ట్రంలో సుమారు రూ.8,504 కోట్లతో 32 రాజీవ్ స్వగృహ ప్రాజెక్టులు చేపట్టడానికి చర్యలు చేపట్టి నేటికీ ఎటువంటి పురోగతి లేదని, దీనిపై రాష్ట్ర గృహ నిర్మాణశాఖా మంత్రి సరైన వివరణ ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు.

పోషణ వాటికలు మరింత మెరుగ్గా ఉండాలి



విద్యార్థులను చదివిస్తున్న కలెక్టర్ పుండ్కర్

గార, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించేందుకు ఏర్పాటు చేసిన పోషణవాటికలు మరింత మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. శుక్రవారం ఆయన బూరవెల్లిలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు యూపీ స్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అందిస్తున్న సౌకర్యాలపై సీడీపీవో రాధా మాధవిని అడిగి తెలుసుకున్నారు. యూపీ స్కూల్‌లో విద్యార్థుల పక్కన కూర్చొని పాఠాలు చదివించారు. ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ, ఏసీడీపీవో తులసీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతతోనే సమాజ అభ్యున్నతి



మహిళా పోలీసులతో ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతతోనే సమాజం అభ్యున్నతి సాధిస్తుందని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీసు శాఖ ఆధ్వర్యంలో వన్‌టౌన్, టూటౌన్, రూరల్ స్టేషన్ల పరిధిలో ఉన్న మహిళ పోలీసుల అభినందన కార్యక్రమం శుక్రవారం నగరంలోని ఓ కల్యాణ మండపంలో జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్పీ మాట్లాడుతూ.. మహిళ సాధికారతకు పోలీసు శాఖ అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలపై 100, 112, చైల్డ్‌లైన్ 1098, సైబర్ 1930 టోల్‌ఫ్రీ నెంబర్ల సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో మహిళ పోలీసులు సందడి చేశారు. వీరందరికి ఎస్పీ జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ కేవీ రమణ, డీఎస్పీ సీహెచ్ వివేకానంద, సీఐలు పైడపునాయుడు, ఈశ్వరరావు, నాగరాజు, త్రినేత్రి, ఎస్ఐ హరికృష్ణ, జనార్దనరావు, రాము, లక్ష్మి, చంద్రకళ, మహిళ పోలీసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రూ.8 కోట్లతో రహదారుల నిర్మాణం

ఆమదాలవలస, మార్చి 7(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని బూర్జ మండలంలో రహదారుల నిర్మాణానికి ఎనిమిది కోట్ల రూపాయలు నిధులు కూటమి ప్రభుత్వం మంజూరు చేసిందని స్థానిక టీడీపీ కార్యాలయ ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధి పథకం నిధులతో మూడు తారురోడ్లు, నాలుగు సీసీ రోడ్ల నిర్మాణం జరుగుతున్నాయన్నారు. నిధులు మంజూరుపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు, పంచాయతీ రాజ్ శాఖా మంత్రి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు స్థానిక ఎమ్మెల్యే రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

హోంగార్డు కుటుంబానికి చెక్కు అందజేత

శ్రీకాకుళం క్రైం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో మరణించిన హోంగార్డు బుక్కా నాగరాజు కుటుంబానికి తోటి సిబ్బంది ఆర్థిక సాయంగా అందించిన మొత్తం చెక్కును ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అందజేశారు. జిల్లాలోని హోంగార్డులంతా తమ ఒక్క రోజు వేతనం రూ.4.10లక్షలు సమకూర్చి శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నాగరాజు భార్య పద్మజకు అందించారు. ఏవో సీహెచ్ గోపినాథ్, రిజర్వ్ ఎస్ఐ ఆర్‌వీ రమణ తదితరులు ఉన్నారు.

సీజీఆర్‌ఎఫ్ ద్వారానే సమస్యలకు పరిష్కారం



వినతులు పరిశీలిస్తున్న సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ

పొందూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్‌ఎఫ్) ద్వారా విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ తూర్పు తీరు ప్రాంత సీజీఆర్‌ఎఫ్ చైర్మన్, రిటైర్డు జిల్లా న్యాయాధికారి బి.సత్యనారాయణ చెప్పారు. మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని వినియోగదారుల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత నాలుగేళ్లలో 1648 సమస్యలపై ఫిర్యాదు స్వీకరించగా 1448 వరకు పరిష్కరించామన్నారు. ఈ ఏడాదిలో 219 సమస్యలపై ఫిర్యాదులు రాగా 90 సమస్యలు పరిష్కరించామని చెప్పారు. ఈ నాలుగేళ్లలో నష్టపరిహారం కోరుతూ 117 సమస్యలు తమ దృష్టికి తీసుకురాగా 108 పరిష్కరించి రూ.14,36,950 పరిహారం అందించామన్నారు. ఈ వేదిక ద్వారా బిల్లింగ్ లోపాలు, విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు, మీటర్లు కాలిపోవడం, లోవోల్టేజ్ హెచ్చు తగ్గులు తదితర 11 రకాల సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. సమస్యలపై వ్యక్తిగతంగా అధికారులకు ఫిర్యాదులు చేసేకంటే 1912 నెంబరుకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయాలని, లేదంటే సీజీఆర్‌ఎఫ్‌కు, అంబుడ్స్‌మెన్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు. వేదికలో సీజీఆర్‌ఎఫ్ సభ్యులు షేక్‌బాబర్, సులేఖారాణి, ఎన్.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయండి

గుజరాతీపేట, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చందనరావు, జిల్లా అధ్యక్షుడు సప్పటి మల్లేసు శుక్రవారం డీఈవో ఎస్.తిరుమల చైతన్యను కలిసి వినతి పత్రాన్ని అందించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

గుజరాతీపేట, మార్చి 7(ఆంధ్రజ్యోతి): కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఎస్టీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.చందనరావు, జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లేసు కోరారు. ఈ మేరకు శుక్రవారం సమగ్ర శిక్ష ఎడిషినల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ శశిభూషణ్‌ను కలిసి వినతి పత్రం అందించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

పొందూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందిన రాపాక గ్రామానికి చెందిన కంది పారంనాయుడుకు సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ.2.50 లక్షల చెక్‌ను ఎమ్మెల్యే కూన రవికుమార్ సతీమణి ప్రమీల అందజేశారు. తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శంకర్‌భాస్కర్, తెలుగు యువత మండల నాయకుడు ఖండాపు శ్రీనివాసరావు ఉన్నారు.

అధికార లాంఛనాలతో హెచ్‌సీ అంత్యక్రియలు



అంత్యక్రియల్లో పాల్గొన్న పోలీసులు, ఇన్‌సెట్‌లో గవరయ్య(ఫైల్)

రణస్థలం/హరిపురం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మందస పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న బి.గవరయ్య(61) ఈ నెల 5న గుండె పోటుతో మృతి చెందాడు. ఆయన స్వగ్రామం రణస్థలం మండలం తెప్పలవలస పంచాయతీ కొత్తపేట గ్రామంలో శుక్రవారం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. గవరయ్య ఏపీ పోలీస్ సర్వీస్‌లో కానిస్టేబుల్‌గా 1989 చేరారు. గవరయ్యకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

జనరిక్ మందులు వాడాలి

అరసవల్లి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): తక్కువ ధరకు లభించే జనరిక్ మందులనే వాడాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి బాలమురళీకృష్ణ అన్నారు. స్థానిక రెడ్‌క్రాస్ సంస్థ కార్యాలయంలో శుక్రవారం జనరిక్ మందులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. ప్రముఖ కంపెనీలు తయారు చేసే నాణ్యమైన మందులు, సర్జికల్ వస్తువులు జన ఔషధి కేంద్రాల్లో లభిస్తాయన్నారు. జిల్లాలో ఏడు కేంద్రాల ద్వారా జనరిక్ మందలు విక్రయిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురపు తేజేశ్వరరావు, తూర్పుగోదావరి ఎస్పీ నరసింహ కిషోర్, డ్రగ్స్ ఏడీ చంద్రరావు, రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

సానుకూల దృక్పథాన్ని అలవర్చుకోవాలి

ఎచ్చెర్ల, మార్చి 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులంతా సానుకూల దృక్పథాన్ని అలవర్చుకోవడం ద్వారా ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని పబ్లిక్ హెల్త్‌డిపార్టమెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ పి.సుగుణాకరరావు అన్నారు. శుక్రవారం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో విజయోత్సవ వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విక్టర్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే ప్రజావారధి

రణస్థలం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల నియోజకవర్గం ప్రజలు సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకు ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు శనివారం తన క్యాంపు కార్యాలయంలో ప్రజా వారధి కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఫిర్యాదు స్వీకరించనున్నట్టు ఎమ్మెల్యే ఎన్ఈఆర్ తెలిపారు. నేరుగా ఫిర్యాదులు స్వీకరించి, సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. నియోజకవర్గం ప్రజలు ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలన్నారు.

50 శాతం రాయితీ

పొందూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అదనపు విద్యుత్ లోడ్‌కు చెల్లించాల్సిన ఫీజును స్వచ్ఛందగా ముందుకు వచ్చే వినియోగదారులకు 50 శాతం రాయితీ ఇవ్వనున్నట్టు ఈఈ పైడి యోగేశ్వరరావు తెలిపారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జూన్ నెలాఖరులోగా స్వచ్ఛందంగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అదనపు లోడు పెరగడంపై ఈమ సిబ్బంది గుర్తించి నోటీసులు అందిస్తే వందశాతం ఫీజు చెల్లించాల్సి వస్తుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డీఈ రమణమూర్తి ఉన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా మల్లేశ్వరరావు

ఎచ్చెర్ల, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల ఇన్‌చార్జి ఎంపీడీవోగా బి.మల్లేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీవో పని చేస్తున్న సీపాన హరిహరరావు మెడికల్ లీవ్‌పై వెళ్లడంతో ఈ బాధ్యతలు ఈవీపీఆర్డీ మల్లేశ్వరావుకి ఇన్‌చార్జిగా నియమించారు.

లింగవివక్ష లేని సమాజం కోసం పోరాడాలి

టెక్కలి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మహిళలపై లైంగిక వేధింపులు, హింస, లింగ వివక్ష లేని సమాజం కోసం పోరాడాలని సీఐటీయూ, యూటీఎఫ్, ఐద్వా, ఎస్ఎఫ్ఐ నేతలు అన్నారు. ఈ మేరకు శుక్రవారం సదస్సు నిర్వహించారు. మహిళలపై దౌర్జన్యాలు జరగకుండా ఉండాలంటే లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు వేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నేతలు నంబూరు షణ్ముఖరావు, రమణమ్మ, భాగ్యలక్ష్మి, యశోదమ్మ, ఎల్లయ్య, సుబ్రహ్మణ్యం, ఉమాభాయి తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉమెన్ ఎన్‌పవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోవిందమ్మ, వైస్ ప్రిన్సిపాల్ సతీష్‌కుమార్, లూక్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

- నరసన్నపేట: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, అప్పుడే సాధికారత సాధ్యమవుతుందని ఏవో సునీత అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లత, వైస్ ప్రిన్సిపాల్ శాంతిహేమ తదితరులు పాల్గొన్నారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు మహిళ హక్కులు-చట్టాలపై న్యాయవాది ధనలక్ష్మి అవగాహన కల్పించారు.

చిన్నారుల వేషధారణ

గార: అంపోలు పంచాయతీ ఆడవరం పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని వక్తలు అన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల వేషధారణ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత, మహిళలు పాల్గొన్నారు.

వివిధ వేషధారణల్లో చిన్నారులు →



క్రైం కార్నర్

సైనిక లాంఛనాలతో ఆర్మీ జవాన్ అంత్యక్రియలు


మృతదేహం వద్ద గౌరవ వందనం చేస్తున్న ఏఆర్ పోలీసులు

వజ్రపుకొత్తూరు, మార్చి7 (ఆంధ్రజ్యోతి): అమలపాడు గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ బచ్చల తిరుపతిరావు(27) అంత్యక్రియలు స్వగ్రామంలో శుక్రవారం నిర్వహించారు. తిరుపతిరావు ఈనెల 4న జమ్ము కాశ్మీర్‌లో మృతి చెందారు. మృతదేహం జమ్ముకాశ్మీర్ నుంచి ప్రత్యేక విమానంలో గురువారం రాత్రి విశాఖపట్నం చేరుకోగా అక్కడ మిలటరీ ఆసుపత్రిలో రాత్రి ఉంచి త్రివిధ దళాల అధికారులు, సైనికులు నివాళి అర్పించారు. అనంతరం శుక్రవారం అమలపాడు గ్రామానికి తీసుకువచ్చారు. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. తిరుపతిరావు తండ్రి వెంకటరావు బీఎస్ఎఫ్‌లో విధులు నిర్వహిస్తుండగా తల్లి కామేశ్వరి కొన్నేళ్ల కిందట మృతి చెందింది. ఆర్మీ అధికారులు, సైనికులు త్రివర్ణ పతాకాన్ని తిరుపతిరావు మృతదేహంపై కప్పి పుష్ప గుచ్ఛాలుంచి నివాళి అర్పించారు. అనంతరం శ్రీకాకుళం ఏఆర్ పోలీసులు గాలిలోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పించారు. తిరుపతి రావు సోదరుడు గోవిందు అంత్యక్రియలు నిర్వహించారు. పెద్ద ఎత్తున గ్రామస్థులు తరలివచ్చి కన్నీరు మున్నీరుగా విలపించారు. దీంతో అమలపాడు గ్రామం శోకసముద్రంలో మునిగిపోయింది.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

శ్రీకాకుళం క్రైం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఇలిసిపురం సమీపంలో ఈ నెల 5న గుర్తుతెలియని ఓ వ్యక్తి గాయపడి ఉండడంతో అతడిని టూటౌన్ పోలీసులు చికిత్స నిమిత్తం రిమ్స్‌లో చేర్పించారు. అత్యవసర చికిత్స నిమిత్తం అతడిని 6న కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందినట్టు టూటౌన్ సీఐ ఈశ్వర రావు తెలిపారు. అయితే ఆ వ్యక్తి ఆచూకీ తెలియకపోవడంతో మృత దేహాన్ని మార్చురీలో భద్రపరిచామని, ఆచూకి తెలిసిన వారు టూటౌన్ పోలీసులను ఆశ్రయించాలని కోరారు.

చికిత్స పొందుతూ ఇచ్ఛాపురం వాసి..

భోగాపురం, మార్చి7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమటాం రాయవలస సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురై తగరపువలసలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురానికి చెందిన పాండ్య జ్యోతేంద్రనారాయణ(42) గురువారం రాత్రి మృతి చెందాడని సీఐ ఎన్వీ ప్రభాకర్ తెలిపారు. పాండ్య జ్యోతేంద్రనారాయణ ప్రస్తుతం విశాఖలో నివాసం ఉంటున్నాడన్నారు. ఈనెల 5న శ్రీకాకుళం వెళ్లి ద్విచక్రవాహనంపై విశాఖ వస్తుండగా అమటాం రాయవలస సమీపంలో ఆగి ఉన్న లారీని బలంగా ఢీకొన్న సంగతి తెలిసిందే. కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

అమ్మవారి గుడిలో దొంగతనం

వజ్రపుకొత్తూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సుంకరజగన్నాథపురం విజయ కనకదుర్గా అమ్మవారి ఆలయంలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. దొంగలు ఆలయం తాళాలు పగులగొట్టి వెండి, బంగారు ఆభరణాలు అపహరించారు. శుక్రవారం ఉదయం గుడిదాసురాలు గాడి హైమావతి ఆలయానికి వచ్చి చూడగా తాళం పగలు గొట్టి ఉండడాన్ని గమనించి చోరీ జరిగిందని గుర్తించి గ్రామ స్థులకు చెప్పింది. వజ్రపుకొత్తూరు పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్ఐ జూన్నారావు ఘటనా ప్రదేశానికి వచ్చి వివరాలు సేకరించారు. ఈ చోరిలో 300 గ్రాముల వెండి, అరతులం బంగారం దొంగలు ఎత్తుకుపోయనట్లు ఏఎస్ఐ చెప్పారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

ముగిసిన గోకార్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలు


పోటీలను పరిశీలిస్తున్న అధికారులు

టెక్కలి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో నాలుగురోజులుగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి గోకార్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి.ఈ పోటీలో పెట్రోల్ విభాగంలో విశాఖకు చెందిన రఘు ఇంజనీరింగ్ కళాశాల, ఎలక్ట్రికల్ విభాగంలో హైదరా బాద్‌కు చెందిన బీవీఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాలలు చాంపియన్లుగా నిలిచాయి. తమిళనాడు సీ-మార్ప్ కళాశాల పెట్రోల్ విభాగంలో రెండో స్థానం, ఎలక్ట్రికల్ విభాగంలో ఐతమ్ ఇంజనీరింగ్ కళాశాల రెండో స్థానం సాధించాయి. పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, ఒడిశా, తమిళనాడు రాష్ట్రాల నుంచి 16 గోకా ర్టింగ్ బృందాలు పాల్గొన్నారు. ఈ పోటీలను ఎంవీఐ డి.సంజీవరావు, సీఐ ఎ.విజయ్‌కుమార్ ప్రారంభించారు. విజేతలకు ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, హైదరాబాద్ హూండా కంపెనీ మేనేజర్ విక్రమ్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి ఎల్ఎల్ నాయుడు, డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు, కన్వీనర్ శ్రీనివాసరావు, కో-కన్వీనర్ డాక్టర్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

11న జీడితోట వేలం పాట

పోలాకి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ పరిధిలో ఉన్న కోడూరు జీడితోటకు 2024-25 సంవత్సరానికి గాను ఈనెల 11న వేలం వేయనున్నట్టు ఎంపీడీవో గరిమెళ్ల రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 11న ఉదయం 10గంటలకు కార్యాలయంలో నేరుగా ధరావవత్తు రూ.30 వేలు చెక్కు రూపంలో చెల్లించాలన్నారు. ఇతర వివరాలకు మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ బలగ ప్రకాష్‌ను సంప్రదించాలన్నారు.

దివ్యాంగులకు ఇళ్ల పట్టాలివ్వాలి

సంతబొమ్మాళి, మార్చి7(ఆంధ్రజ్యోతి): అర్హులైన దివ్యాంగులందరికీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలని ఆ సంఘం జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు ఆవుల వేణుగోపాల్ కోరారు. శుక్రవారం సంతబొమ్మాళి ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో దివ్యాంగులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి పి.మోహనరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

మెళియాపుట్టి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని తహసీల్దార్ బి.పాపారావు కోరారు. బ్రెడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్‌పండా, ఎంఈవో పద్మనాభం, ఏఈ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా ఎల్లమ్మ జాతర

సిర్లపోతన్న, ఎల్లమ్మ జాతర శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఎల్లమ్మ జాతరకు భక్తులు పోటెత్తారు. ప్రజలు ఉదయాన్నే ఇంటింటికి వెళ్లి జోగి దండి బియ్యం, పప్పు సేకరించి ఎల్లమ్మకు నైవేద్యంగా సమర్పించారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.
-ఆంధ్రజ్యోతి బృందం


హిరమండలం: ఎల్లమ్మను దర్శించుకుంటున్న భక్తులు


కవిటిలో..


పాతపట్నం: కొరసవాడలో..


కొత్తూరు: పూజలందుకున్న నివగాం ఎల్లమ్మ


సోంపేట: అలంకరణలో అమ్మవారు


ఇచ్ఛాపురం: బెల్లుపడ రోడ్‌లో..


కంచిలి: మజ్జిపుట్టుగలో ఎల్లమ్మకు పూజలు


ఎల్ఎన్‌పేట: మిరియాపల్లిలో..


హరిపురం: శ్రీనివాసపురంలో..

వేతనం స్వాహాపై గ్రీన్ అంబాసీడర్ల ఫిర్యాదు

కొత్తూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మెట్టూరు బిట్-1(కృష్ణాపురం) పంచాయతీ గ్రీన్‌అంబాసీడర్ల 9 నెలల వేతనాలను పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ స్వాహా చేశారని, తగు చర్యలు తీసుకుని న్యాయం చేయాలని గ్రీన్ అంబాసిడర్లు సిరిపురం దండాసి, దిమ్మిడి రామారావు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఎంపీడీవో వి.నీరజను వివరణ కోరగా ఫిర్యాదు అందడం వాస్తవమని, సమగ్ర దర్యాప్తు చేసి నివేదిక అందించాలని ఈవోపీఆర్డీ వసంతకుమారిని ఆదేశించామని, నివేదికకు ఉన్నతాధికారులకు పంపుతామన్నారు.

12న జనసేన ఆవిర్భావ దినోత్సవం

పాతపట్నం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాల ని సుడా చైర్మన్, పార్లమెంటరీ నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి కొరికాన రవికుమార్ కోరారు. స్థానిక కొరికాన ఫౌండేషన్ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి క్రియాశీలక సభ్యులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈనెల 12న నిర్వహించనున్న ఆవిర్భావ దినోత్సవానికి పెద్దఎత్తున క్యాడర్ తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకుడు గేదెల చైతన్య, నక్క క్రాంతికుమార్, నవీన్ కుమార్ పాల్గొన్నారు.

నెలాఖరులో ఇళ్లు పూర్తి చేస్తే ప్రోత్సాహకం

నరసన్నపేట, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఇళ్ల నిర్మాణాలను ఈనెల 31 లోగా పూర్తి చేసిన వారికి ప్రభుత్వం రూ.50 వేలు ప్రోత్సాహకం అందిస్తుందని జడ్పీ సీఈవో శ్రీధర్‌రాజా అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద హౌసింగ్ లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ ఉరిటి రాజేంద్రప్రసాద్, ఎంపీడీవో బొడ్డేపల్లి మధుసూదనరావుపాల్గొన్నారు.

ఏపీపీగా అచ్చెన్నాయుడు



టెక్కలి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): టెక్కలి కోర్టు సముదాయాలకు అడిషినల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ)గా న్యాయవాది కింజరాపు అచ్చెన్నాయుడును నియమిస్తూ డైరెక్టరేట్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్, విజయవాడ నుంచి భైర రామకోటేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారు. అచ్చెన్నాయుడు స్వగ్రామం నిమ్మాడ. ఈయన 2019 నుంచి 2022 వరకు కోటబొమ్మాళి జూనియర్, టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి కోర్టుల్లో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా పనిచేశారు. మూడు పర్యాయాలు కోటబొమ్మాళి బార్ అసో సియేషన్ అధ్యక్షుడిగా, నిమ్మాడ ఎంపీటీసీగా మూడు పర్యాయాలు పనిచేశారు. టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ ప్రధానకార్యదర్శిగా, ఆ పార్టీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడిగా కూడా వ్యవహరించారు.

విజనరీ కలిగిన నేత చంద్రబాబు



టెక్కలి, మార్చి 7(ఆంధ్ర జ్యోతి): ఐదేళ్ల జగన్ విధ్వంస పాలనపై ప్రజలు విసిగిపోయి కూటమి ప్రభుత్వానికి అధికారం అప్పగించారని, ఆ తరువాత సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నేతృత్వంలో రాష్ట్రాన్ని గాడిలో పెడు తున్నారని తెలుగుశక్తి అధ్యక్షుడు బీవీ రామ్ అన్నారు. శుక్ర వారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. విజనరీ కలిగిన నేత చంద్రబాబు నాయుడని అన్నారు.

బోర్ల తవ్వకం పనులు ప్రారంభం

హిరమండలం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): హిరమండలంలో నాలుగు నెలలుగా రక్షిత నీటి పథకం ద్వారా పూర్తి స్థాయిలో తాగునీరు రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీలో నెలకొన్న తాగునీటి సమస్యపై 'ఆంధ్రజ్యోతి'లో పలు కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఇషాన్‌బాషా ఆదేశాల మేరకు గొట్టాబ్యారేజి దిగువన మూడు బోర్లు ఏర్పాటుకు పనులు ప్రారంభించారు. పనులు జరుగుతున్న కారణంగా పంచాయతీలో శని, ఆదివారాల్లో తాగునీటి సరఫరా ఉండదని ఈవో హరికృష్ణ తెలిపారు.

కుదిరిన వేతన ఒప్పందం

- 25 రోజుల సమ్మెకు తెర

పలాస, మార్చి 7(ఆంధ్రజ్యోతి): వేతన ఒప్పందం విషయంలో రైస్‌మిల్లు కార్మికులకు, మిల్లు యాజమాన్యాల మధ్య నెలకొన్న వివాదం ఎట్టకేలకు ముగిసింది. ప్రస్తుతం ఇస్తున్న వేతనంపై 19.5 శాతం పెంచేందుకు యాజమాన్యాలు అంగీకరించడంతో 25 రోజుల సమ్మెకు కార్మికులు ముగింపు పలికారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శాసనపురి మురళీకృష్ణ, మందస రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇప్పిలి వెంకటేశ్వరరావు, సీఐటీయూ అధ్యక్షుడు ఎన్.గణపతి, జిల్లా కార్యదర్శి తేజేశ్వరరావు, కార్మికులతో కలిసి రౌండ్‌టేబుల్ సమా వేశం నిర్వహించారు. ఇరువర్గాల మధ్య అంగీకారం కుదరడంతో సమ్మె ముగిస్తున్నట్లు కార్మికులు ప్రకటిం చారు. వేతనాలు పెంచాలని కోరుతూ మండల రైస్ మిల్లు కార్మికులు సమ్మెబాట పట్టారు. ఈ నేపథ్యంలో కార్మిక సంఘ నేతలు, మిల్లుల యూనియన్ ప్రతినిధుల మధ్య సమావేశాలు జరిగినా సమస్య పరిష్కారం కాలేదు. కార్మికులు కనీసం 25 శాతం వేతనం పెంచాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యం లో టీడీపీ నేత వెంకన్నచౌదరి సూచనల మేరకు 19.5 శాతం వేతనం పెంచేందుకు యాజమాన్యాలు అంగీకరించడంతో ఇరువర్గా లు ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ సందర్భంగా రైస్ మిల్లర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శాసనపురి మురళీకృష్ణ విలేకర్లతో మాట్లాడుతూ.. జటిలమైన సమస్య ఎంతో మంచి వాతావరణం మధ్య నేతల సమన్వయంతో పరిష్క రించడం జరిగిందని, కార్మికులకు వ్యాపార సంఘం పూర్తిగా అండగా ఉంటుందన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నేతలు కె.కేశవ రావు, బి.మల్లేసు, లచ్చయ్య, కె.బాలకృష్ణ, రైస్ మిల్లుల యజమానులు వి.జగదీష్, వీరభద్రరావు, వి.శివ తదితరులు పాల్గొన్నారు.


వేతన ఒప్పంద పత్రాలను తీసుకుంటున్న రైస్‌మిల్లర్ల సంఘ నాయకులు

ప్రభుత్వ భూములను పరిరక్షించండి: ఎమ్మెల్యే ఎంజీఆర్


సిసోడియాకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం/కొత్తూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను పరిరక్షించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. ఈ మేరకు రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పీ సిసోడియాను శుక్రవారం సచివాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎంజీఆర్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో విలువైన ప్రభుత్వ భూములు, చెరువులు, అటవీ, దేవాదాయశాఖ భూములు ఆక్రమణలకు గురయ్యాయని, వీటిపై సమగ్ర సర్వే చేసి ఆక్రమణలను తొలగించాలని కోరారు. ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పాతపట్నంలో గ్రామకంఠాలు, ప్రహరాజపాలెం రెవెన్యూ గ్రామ పరిధిలో విలువైన ప్రభుత్వ డి-పట్టా భూములు, చెరువులలో ఆక్రమణలను తొలగించాలని కోరారు. దేవాలయాల భూములపై సమగ్ర విచారణ చేపట్టాలని విన్నవించగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

మర్రిపాడులో ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయాలి


మంత్రి అచ్చెన్నకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

మెళియాపుట్టి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టి మండలం మర్రిపాడు-సి నుంచి వెంకటా పురం వరకు సాగునీరు వచ్చేలా ఎత్తిపోతల పథకం మంజూరు చేయాలని మాజీ ఎంపీపీ బైరిశింగి లక్ష్మీనారాయణ, మర్రిపాడు సర్పంచ్ రవ్వల అనురాధ గణపతిరావు ఆధ్వర్యంలో రైతులు కోరారు. ఈ మేరకు శుక్రవారం వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును అమరావతిలో కలిసి వినతి పత్రం అందించారు. మహేంద్రతయన నదిలో పైపులైన్లు ఏర్పాటు చేసి సాగు నీరు అందించాలని కోరారు. మెళియాపుట్టికి ఐటీడీఏ ఏర్పాటుకు ప్రయత్నించడం ఆనందంగా ఉందని, గిరిజనులు కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటారన్నారు. ఐటీడీఏ ఏర్పాటుకు కృషి చేసిందుకు ఎమ్మెల్యే మామిడి గోవింద రావును సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు రాజ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం


అమ్మవార్ల విగ్రహాల ఊరేగింపు దృశ్యం

నందిగాం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): నరేంద్రపురంలో రెయ్యి బోడమ్మతల్లి, భూలోకమాత అమ్మవార్ల ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామస్థుల ఆధ్వర్యంలో గ్రామపురోహితులు సత్యనారాయణ శర్మ, టెక్కలికి చెందిన వేదపండితులు బంకుపల్లి సంతోష్ శర్మ పర్యవేక్షణలో ఉదయం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవార్ల విగ్రహాలతో ఊరేగింపు నిర్వహించారు. హరి పురానికి చెందిన అసిరమ్మతల్లి కోలాట బృందం ప్రదర్శన ఆకట్టుకుంది.

ఘనంగా ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

ఎల్.ఎన్.పేట, మార్చి 7(ఆంధ్రజ్యోతి): చిన్నకొల్లివలస ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో గ్రామస్థులు నిర్మించిన కోదండ రామాలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠోత్సవాల్లో భాగంగా శుక్రవారం కోదండ రామస్వామి, యంత్రమూర్తుల విగ్రహాలను మంగళ వాయిద్యాలు, రామనామ సంకీర్తనల నడుమ ఘనంగా ఊరేగించారు. ఈ ఊరేగింపులో మహిళలు పెద్దఎత్తున కలశాలు పట్టుకుని పాల్గొన్నారు. ప్రతిష్ఠోత్స వాలు శనివారం నుంచి సోమవారం వరకు పురోహితులు భాస్కరభట్ల వరప్రసాదశర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని సర్పంచ్ ఆర్.రామారావు తెలిపారు.


ముర్రాటలతో ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

న్యూస్ బాక్స్

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పలాసరూరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ 11 కేవీ చినబాడం ఫీడర్‌లో వేసవి దృష్ట్యా ఆర్‌డీ ఎస్ఎస్ స్కీంలో భాగంగా కొత్త విద్యుత్ స్తంభాలనే వేయనున్నందున ఆదివారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు ఈఈ జి.యజ్ఞేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో ఆరోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు పెంటిభద్ర, జయ రామచంద్రపురం, ఓల్డ్‌ఎస్‌హెచ్-5, రైల్వేగేట్‌డౌన్, రాజపురం, పెసరపాడు,చినబాడం ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

మెళియాపుట్టి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టి జడ్పీ హైస్కూల్‌లో చదువుకుని పరీక్షలకు సిద్ధ మవుతున్న విద్యార్థులకు టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు అసపాన రాజశేఖరరెడ్డి అట్టలు, పెన్నులు, వాటర్ బాటిళ్లను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం గణపతిరావు, విద్యార్థుల తల్లిం దండ్రుల కమిటీ చైర్మన్ బి.చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

దండుగోపాలపురంలో..

సంతబొమ్మాళి,మార్చి7(ఆంధ్రజ్యోతి): దండుగోపాలపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, మాజీ సర్పంచ్ ఆరంగి వసంతరావు కుమారుడు శరత్ కుమార్ పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న 72 మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రిని శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కోత చైతన్య, ఐటీడీపీ మండల అధ్యక్షుడు బెండి అరుణ్‌కుమార్, భాస్కరరావు పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

కోటబొమ్మాళి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని, లేకుంటే సివిల్ కేసులు నమోదుతో పాటు అధిక వడ్డీ చెల్లించాల్సి ఉంటుందని జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి బీఎంఆర్ ప్రసన్నలత అన్నారు. స్థానిక స్టేట్‌బ్యాంకులో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. బ్యాంకులో ఇలాంటి శిబిరం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. రాగోలు జెమ్స్ ఆసుపత్రి వైద్యులు రోగులను పరీక్షించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ లక్ష్మీనారాయణ, న్యాయవాది లఖినేని శ్రీనివాస్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

జలుమూరు, (సారవకోట) మార్చి 7: గ్రామాల్లోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయించాలని సారవకోట ప్రాంతీయ పశు సంవర్ధక శాఖ ఏడీ మంద లోకనాథం తెలిపారు. సారవకోటలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించారు కార్యక్రమంలో ఏహెచ్ఏ పాల డిల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

గ్లో సంస్థ ఆధ్వర్యంలో శ్రమదానం

పలాసరూరల్,మార్చి7(ఆంధ్రజ్యోతి): పలాస మండలం కిష్టు పురంలో గ్లో సంస్థ ఆధ్వర్యంలో నిర్మిం చిన నీటి పథకం చుట్టూ చెత్త పేరుకుపోవడంతో ఆ సంస్థ చైర్మన్, ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదే శాల మేరకు శుక్రవారం ఎక్స్‌కవేటర్ సాయంతో శుభ్రం చేప ట్టారు. చుట్టూ ఉన్న చెత్తను తొలగించి బ్లీచింగ్ చల్లారు. కార్యక్రమంలో తులసీరావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.